క్లుప్తంగా

నేడు బోడిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

కొయ్యలగూడెం : బోడిగూడెం గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కడకట్ల గడ్డియ్య పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరవుతారని, పార్టీ శ్రేణులు ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



టేకూరులో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వేలేరుపాడు : నెస్లీ ఇండియా కంపెనీ, జేసీఐ ఇండియా ఆధ్వర్యంలో వేలేరుపాడు మండలంలోని మారుమూల గ్రామాలైన టేకూరు, ఎడవల్లి, ఎర్రమెట్ల, తూర్పుమెట్ట గ్రామాల్లో వరద బాధితులకు మంగళవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి రూ.1500 విలువ చేసే నిత్యావసర వస్తువులు అందజేశారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశానుసారం ఆయా గ్రామాల్లో మొత్తం 600 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఐ ఏలూరు సెక్రటరీ కేఎస్ రోహిత్, మర్రి సత్యనారాయణ, డైరెక్టర్ ఎన్టీ నర్సవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ ఎలీషా, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, వేలేరుపాడు ఆర్ఐ దుర్గారావు పాల్గొన్నారు.

ముమ్మరంగా దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కుక్కునూరు : మండల కేంద్రంలోని స్థానిక రైస్‌మిల్ కాలనీలో మంగళవారం కుక్కునూరు పంచాయతీ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేశారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మురుగు పేరుకుపోయి లార్వా ఉత్పత్తి ఎక్కువయ్యే అవకాశం ఉండడంతో దానిని నివారించే దిశగా చర్యలను ముమ్మరం చేసినట్టు పంచాయతీ కార్యదర్శి మోహన్ చెప్పారు. జూలై నెలలో గోదావరి వరద గ్రామాన్ని చుట్టుముట్టిన నేపథ్యంలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు. గ్రామస్తులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని సూచించారు.

శ్రీవారి సేవలో రాష్ట్ర ప్రభుత్వ ఏడీసీ



శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఏడీసీ మేజర్ దీపక్ శర్మ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఏడీసీ మేజర్ దీపక్ శర్మ మంగళవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలికి, శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

బర్రింకలపాడులో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం పంచాయతీ పరిధిలో గల బర్రింకలపాడులో మంగళవారం రాజీవ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ (ఆరోగ్యశ్రీ), ఏపీ వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో ఏలూరు ఆశ్రం హాస్పిటల్, మణికంఠా డయాగ్నోస్టిక్ సెంటర్ సంయుక్తంగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఆప్తమాలజీ, గైనకాలజీ, ఈఎన్‌టీ డాక్టర్లు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా షుగర్, ఈసీజీ, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 150 మంది వరకూ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు మణికంఠా డయాగ్నోస్టిక్ నిర్వాహకులు తుమ్మలపల్లి బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంబాబు, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అర్హులకు సంక్షేమ లబ్ధి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- బందంచర్లలో గడపగడపకు మన ప్రభుత్వం

టి.నరసాపురం : దేశంలోనే సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని బందంచర్లలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా రాజకీయాలకు అతీతంగా అర్హులకు పారదర్శకంగా పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలవాలని బాలరాజు కోరారు. స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా గ్రామంలో ఏళ్ల తరబడి భూముల్లో సాగులో ఉన్న రైతులకు ఆ భూమిపై హక్కు కల్పించే చర్యలు చేపట్టాలని తహసీల్దార్ జేవీ సుబ్బారావును ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పెరుగుతున్న ప్రజాదరణ తట్టుకోలేక, చంద్రబాబు, లోకేష్ కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పలు అంశాలపై కోర్టులకు వెళ్లి సంక్షేమాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారన్నారు. గ్రామాల్లో జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి స్పష్టంగా కానవస్తుందన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణంతో పాటు నాడు–నేడులో పాఠశాలల రూపురేఖలను మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు.



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

ప్రారంభోత్సవాలు

బందంచర్ల గ్రామంలో కె.జగ్గవరం సహకార సంఘం నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బాలరాజు ప్రారంభించారు. అలాగే జగనన్న కాలనీల్లో నిర్మించిన రెండు గృహాలకు గృహప్రవేశాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బాలరాజు వెంట ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు, సర్పంచ్‌లు గుండె వెంకటేశ్వరరావు, పి.శివమాధవి, జిల్లా మూర్తి, ఎంపీటీసీ పాదిలి సావిత్రి, ఏఎంసీ డైరెక్టర్ బొట్ల విశ్వనాథం, రాయపటి హరికిషోర్, ఆచంట కుటుంబరావు, అనుమోలు రామకృష్ణ, బొంతు అంజిబాబు, కనిపెడ నాగేశ్వరరావు, మండల రైతు సంఘం ప్రతినిధి మక్కిన వెంకట గోపాలరావు, మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ అధ్యక్షులు దాసరి రాంబాబు, మొరవనేని అనిల్, పార్టీ ఎస్టీసెల్ జిల్లా నాయకులు నిరీక్షణరావు, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, కన్నం సర్వేశ్వరరావు, డి.సీతారామప్రసాద్, బోళ్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పోలవరం రూరల్ : మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి ఈ నెల 27వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జి.శ్రీను తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. 29వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఎంపికైన వలంటీర్లు 30వ తేదీన విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు. కొరుటూరు – 1 (ఎస్టీ, మహిళ), పోలవరం–3 (ఓసీ, మహిళ), పోలవరం – 1 (ఎస్టీ, మహిళ) వలంటీర్లకు సంబంధించి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మిర్చి సాగుకే మొగ్గు

- నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- మంచి రేటు వస్తుందని ఆశలు
- పత్తి సాగుపై తగ్గుతున్న ఆసక్తి

కుక్కునూరు : మండలంలో మిర్చి సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలో నారుమడుల తయారీలో రైతులు నిమగ్నమయ్యారు. ఇటీవల వర్షం కురిసి తెరిపివ్వడంతో మిర్చి నారుమడులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేస్తున్న మిర్చి పంటపైనే కోటి ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది మిర్చి పంట తెగుళ్ల బారిన పడినా మంచి రేటు ఉండడంతో నష్టాల బారినుంచి తప్పించుకోగలిగామని రైతులు పేర్కొన్నారు. గతంలో పత్తి పంటను సాగు చేసిన రైతులు కూడా మిర్చి పంట సాగుకే ఆసక్తి కనబరుస్తున్నారు. గత రెండు, మూడు సంవత్సరాలుగా ఖరీఫ్ సీజన్‌లో పత్తి మొక్కలు ఎదిగే సమయంలో గోదావరి వరదతో మొక్కలు నీటమునిగి తీవ్రంగా నష్టం చవిచూసిన రైతన్నలు, కష్టమైనా, పెట్టుబడి ఎక్కువైనా మిర్చి పంట సాగే నయమని భావిస్తున్నారు. గతంలో మండల వ్యాప్తంగా సుమారుగా మూడు వేల ఎకరాల్లో పత్తిపంటను రైతులు సాగుచేసేవారు. వెయ్యి ఎకరాలకు పైగా మిర్చి పంట సాగు ఉండేది. కాని ఖరీఫ్ సీజన్‌లో గోదావరికి వరద ప్రమాదం పొంచి ఉండడంతోనే పత్తి పంటపై పెట్టుబడి పెట్టి నష్టపోవడం ఎందుకని భావించిన రైతన్నలు క్రమంగా పత్తి పంట సాగు తగ్గించుకుంటున్నట్టు తెలుస్తుంది. కాగా ఇంతలా పెట్టుబడి పెట్టి మిర్చి నారును తయారు చేసుకోని సాగుకు సిద్ధమవుతున్నా పంట చేతికి వచ్చే సమయానికి పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయం రైతుల్లో నెలకొంది.



రైతులు సిద్ధం చేసుకుంటున్న మిర్చి నారుమడులు

విద్యుత్ కోతలపై రైతుల రాస్తారోకో

కొయ్యలగూడెం : విద్యుత్ కోతలకు నిరసనగా దిప్పకాయలపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. సబ్‌స్టేషన్ ఎదుట ఉన్న మెయిన్‌రోడ్డుకు పలు గ్రామాలకు చెందిన ప్రజలు చేరుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. 9 గంటలు కాకపోయినా కనీసం ఏడు గంటలు నాణ్యమైన విద్యుత్ వ్యవసాయానికి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ముమ్మరంగా ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు సంభవిస్తున్నాయని దీంతో వ్యవసాయానికి నారుమడులకు సకాలంలో నీరు అందడం లేదని రైతు నాయకులు కాకర్ల శేషు పేర్కొన్నారు. అదేవిధంగా ఎల్ఆర్ తరచూ విధించకూడదని పేర్కొన్నారు. రాస్తారోకో చేపట్టడంతో కన్నాపురం, కొయ్యలగూడెం వైపు రాకపోకలు స్తంభించిపోయాయి. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ ఎస్‌వీ రామారావు రైతులతో చర్చించడానికి వెళ్లిన సమయంలో ఏఈతో సహా సిబ్బందిని కార్యాలయంలో నిర్బంధించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైతు ప్రతినిధులకి ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు రాస్తారోకోను విరమించారు.



దిప్పకాయలపాడు సబ్‌స్టేషన్ ఎదుట మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

లింగపాలెం : వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారి ఏవీఆర్ గంగాధరావు కార్యదర్శులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో మండల స్థాయి కార్యదర్శుల సమావేశంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పారిశుధ్యం తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ గ్రామాల్లో విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, కలుషితమైన నీరు రాకుండా, పైపులైన్లు లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయినేజీలు శుభ్రపర్చాలన్నారు. మంచి నీరు, డ్రెయినేజీల్లో బ్లీచింగ్ వేయించాలన్నారు. హౌసింగ్, ఉపాధి హామీ, డ్రాప్‌అవుట్స్ తదితర అంశాలపై కార్యదర్శులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదం, ఈవోపీఆర్‌డీ రత్నకుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్యదర్శులతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి గంగాధరావు, ఎంపీడీఓ ఆశీర్వాదం

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

చింతలపూడి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రాంబాబు పేర్కొన్నారు. చింతలపూడిలో మంగళవారం ఎకో ఫ్రెండ్లీ ప్లాస్టిక్ లిమిటెడ్ రూపొందించిన బయో డీగ్రేడబుల్ బ్యాగ్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎకో భారత్ అనే ప్రాజెక్ట్ ద్వారా పర్యావరణానికి హాని కలిగించని వస్తువులు తయారు చేస్తూ ప్రకృతిని పరిక్షించేందుకు కృషి చేస్తున్న ఎకో ఫ్రెండ్లీ ప్లాస్టిక్ లిమిటెడ్ సభ్యులను ఆయన అభినందించారు. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి 100 సంవత్సరాలు పైనే పడుతుందన్నారు. అధిక ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని, తద్వారా మానవ జీవనం కష్టతరం అవుతుందన్నారు. కావున ప్లాస్టిక్‌ను మాని ప్రజలు బయోడీగ్రేడబుల్స్ వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎకో ఫ్రెండ్లీ ప్లాస్టిక్ లిమిటెడ్ యాజమాన్య సభ్యులు పి.వంశీ, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.



బయో డీగ్రేడబుల్ బ్యాగ్‌లను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాంబాబు

పామాయిల్ చెట్ల తెగుళ్ల నివారణకు సూచనలు

కామవరపుకోట : పామాయిల్ చెట్లకు ఆశించు తెగులు, కీటకాల నివారణకు హెక్సోకొనజోల్ ఎంతో ఉపయోగపడుతుందని జాతీయ పామాయిల్ పరిశోధనా స్థానం పెదవేగి శాఖ విశ్రాంతి డైరెక్టర్ డాక్టర్ రెతినం అన్నారు. మంగళవారం ఆడమిల్లి గ్రామంలోని సమాధాన్ ఉద్యాన శాఖ, గోద్రెజ్ ఆగ్రోవిట్, సాలిడ్ అరిడెడ్ కంపెనీల ఆధ్వర్యంలో రైతులకు పామాయిల్ చెట్లకు వచ్చే తెగుళ్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ విశ్రాంతి డైరెక్టర్ డాక్టర్ రెతినం మాట్లాడుతూ రానున్న రోజుల్లో పామాయిల్ తోటలో గానోడెర్మా తెగులు సోకే అవకాశం ఉందన్నారు. ఈ తెగులు వలన ఆకులు వేలాడుతూ కాండంలో కణజాలం దెబ్బతిని చెట్టు మొదలు పుట్టగొడుగులు ఏర్పడతాయని, దీనివలన అధిక నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ తెగులు నివారణకు ఒక లీటరు నీటిలో 3 మిల్లీ లీటర్ల హెక్సోకోనాజల్ ద్రావణాన్ని కాండానికి ఇంజక్షన్ రూపంలో ఇవ్వాలని లేదా ఒక లీటరు నీటిలో 3 మిల్లీ లీటర్ల హెక్సోకోనాజల్ ద్రావణంలో 15 లీటర్ల నీళ్లు కలిపి మొదలు తడిచేటట్టు పోయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్.రామ్మోహన్, విజయరాయి ఉద్యానశాఖ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.తిరుపతిరెడ్డి, గోద్రెజ్ డీజీఎం మురళి, ఉద్యాన శాఖ అధికారి లక్‌పతి, సిబ్బంది పాల్గొన్నారు.



పామాయిల్ తోటలో తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు

దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలు చెల్లించాలి

ద్వారకాతిరుమల: దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలను వడ్డీతో సహా రైతులకు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని ఎం.నాగులపల్లిలో రైతు సంఘం నాయకులు పర్యటించి, దొండ పందిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దొండ, ఇతర కూరగాయల సాగు సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరా దొండ పందిరికి రూ.2.50 లక్షలకు పైగా పెట్టుబడి అవుతోందన్నారు. పందిళ్లకు సబ్సిడీ ఇస్తారో లేదో స్పష్టత లేక రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. గత మూడేళ్లుగా వైరస్ తెగుళ్ల వచ్చి పందిళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అప్పులు చేసి పందిళ్లు వేసిన రైతులకు సబ్సిడీ బకాయిలు అందకపోవడం వల్ల, చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే వడ్డీతో సహా దొండ పందిళ్ల సబ్సిడీని రైతులకు ప్రభుత్వం అందించాలన్నారు. అలాగే సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.మురళి, ఎలమర్తి శ్రీనివాసరావు, టి.భాస్కరరావు, ఎ.లక్ష్మణరావు, కె.సురేష్ తదతరులున్నారు.



దొండ రైతుల సమస్యలను తెలుసుకుంటున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

కొయ్యలగూడెం : బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని సచివాలయాల శాఖ ఎస్‌బీసీసీ కో–ఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ అన్నారు. కొయ్యలగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహన్ మాట్లాడుతూ బాల్య దశలో వివాహాలు చేయడం వల్ల అనారోగ్యాల బారిన పడడమే గాక భవిష్యత్ ఎదుగుదల కుంటుపడుతుందని వివరించారు. 2006 బాల్య వివాహ నిషేధ చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు బాలలకు జరిగిన పెళ్లి రద్దు చేయబడుతుందని చెప్పారు. పెళ్లి చేసిన పురోహితులు, పాస్టర్లు, ఖాజీలతో పాటు పెళ్లి కొడుకు తల్లిదండ్రులు, పెళ్లి కూతురు తల్లిదండ్రులు అరెస్టు అవడమేకాక ఒకొక్కరూ రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతేగాక 2019లో పోక్సో చట్టానికి చేసిన సవరణల ప్రకారం బాలికలను వివాహం చేసుకుని శారీకర సంబంధం పెట్టుకుంటే 20 ఏళ్ల శిక్ష పడుతుందని తెలిపారు. యుక్తవయసు బాలికలు చదువుపై శ్రద్ధ పెట్టి బంగారు భవిష్యత్‌కి బాటలు వేసుకోవాలని సూచించారు. కళ్లు తిరగటం, ఆయాసం రావటం రక్తహీనత వల్ల ఎదురయ్యే సమస్యలని బాలికలకు అవగాహన కల్పించారు. రక్తహీనత చదువుపై ఏవిధంగా ప్రభావం చూపుతుందో ఉదాహరణలతో స్నేహన్ వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, సచివాయల సంక్షేమ కార్యదర్శి రాజు, సంరక్షణ కార్యదర్శి ఆశ, ఏఎన్ఎం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

బుట్టాయగూడెం : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి మంగళవారం జీలుగుమిల్లి సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్పీకి పోలవరం డీఎస్పీ ఏ.శ్రీనివాసులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ పలు రికార్డులను పరిశీలించారు. అలాగే స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, సిబ్బంది వివరాలను సీఐ బి.వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఎస్పీ మేరీ ప్రశాంతి స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగానే తాను ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. విధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు చెప్పారు. సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని అన్నారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణపై కూడా సమీక్షించినట్లు చెప్పారు. జీలుగుమిల్లి ఎస్సై వి.చంద్రశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

నేడు ఆంగ్ల మాధ్యమ బోధనపై శిక్షణ

జంగారెడ్డిగూడెం : ఆంగ్లమాధ్యమ బోధనపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాదబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ఆంగ్ల శాఖ, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో కొయ్యలగూడెం డివిజన్ స్థాయిలో గల జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, టీజీటీ, పీజీటీ, ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి పి. శ్యాంబాబు, కొయ్యలగూడెం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రామన్న దొర, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం జీలుగు మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొంటారన్నారు.

గద్దర్ సంస్మరణ సభ

జంగారెడ్డిగూడెం : పల్లె గొంతులో నుంచి, శ్రమజీవుల చెమట చుక్కలో నుంచి పుట్టిన పాట గద్దర్‌పాట అని సీపీఐఎంఎస్ బహుజన ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అనిశెట్టి రాము అన్నారు. స్థానిక ఎంబీ సోషల్ క్లబ్‌లో మంగళవారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. దళిత సాహితీవేత్త జీవీరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాము మాట్లాడుతూ గద్దర్ పాట అనేక ఉద్యమాలకు స్ఫూర్తిగా, తోడుగా నిలిచిందన్నారు. నేటి ప్రజాస్వామిక ఉద్యమాలకు ఆయన పాట ఒక దిక్సూచి అన్నారు. యువత గద్దర్ పాటలోని సాహిత్యాన్ని అర్థం చేసుకుని, ఆయన సాగించిన ఉద్యమపందాను అలవర్చుకోవాలన్నారు. చొరప్పన్, వెంకట్, ఈశ్వరయ్య, రంగన్న, బాబు, వెంకట్, పున్నయ్య పాల్గొన్నారు.

మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో మంగళవారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు స్వామివారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి రూ.1,46,097 ఆదాయం వచ్చిందని, 800 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు చెప్పారు. ధర్మకర్తల మండలి సభ్యులు మట్టిండి మోహన కృష్ణ, ఆలయ పర్యవేక్షకులు కురగంటి రంగారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధర్మాజీగూడెం బస్టాండ్ ఆక్రమణల పరిశీలన



ధర్మాజీగూడెం బస్టాండ్ ఆక్రమణలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాజేంద్రన్

లింగపాలెం : ధర్మాజీగూడెం కొత్త బస్టాండ్ ఏరియాలో ఉన్న ఆక్రమణలను మంగళవారం నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు. బస్టాండ్ ప్రాంతంలో ఆక్రమణలో ఎంతమంది ఉన్నది గుర్తించాలని ఆయన రెవెన్యూ అధికారులకు సూచించారు. మరోసారి వచ్చి ఈ ఆక్రమణలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మఠంగూడెం గ్రామంలో స్పందనలో వచ్చిన ఫిర్యాదును సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ మురళీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

అగ్రికల్చర్ అనుబంధ ఉద్యోగ సంఘం ఉపాధ్యక్షుడిగా కుమార్



తొర్లపాటి కుమార్

లింగపాలెం : రాష్ట్ర విలేజ్ అగ్రికల్చర్ అనుబంధ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా కె.గోకవరం సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ తొర్లపాటి కుమార్ ఎన్నికయ్యారు. ఈనెల 20న జరిగిన జరిగిన రాష్ట్ర విలేజ్ అగ్రికల్చర్ అనుబంధ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని, తాను ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కుమార్ మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. రైతు భరోసా కేంద్రాలలో పనిచేస్తున్న వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కుమార్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఇద్దరు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, వారిని చంపుతానని బెదిరించిన నేరంపై యడ్లపల్లి శ్రీను, మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. చిన్నంవారిగూడెంకు చెందిన బుద్దా పూజ భర్త చనిపోవడంతో పుట్టింటిలోనే ఉంటోంది. ఈ నెల 12న పూజ, ఆమె తల్లిని అదే గ్రామానికి చెందిన యడ్లపల్లి శ్రీను, మరో నలుగురు కలిసి పక్క ఇంట్లోకి లాక్కొని వెళ్లి, ఇద్దరిని వివస్త్రలను చేసి అసభ్యకరంగా ప్రవర్తించారు. ఇష్టం వచ్చినట్లుగా కొట్టడంతోపాటు, పూజ మెడకు ట్యూబ్ కట్టి ఉరివేసేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో పూజ కేకలు వేయడంతో చుట్టపక్కలవారు రావడాన్ని గమనించిన ఐదుగురు అక్కడి నుంచి పారిపోతూ మీ ఇద్దరిని చంపుతామని బెదిరించారు. పూజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

చింతలపూడి : ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని పోతునూరు, రాఘవాపురంలో మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.సాయి స్వరూప్ చెప్పారు. రాఘవాపురంలో చేకు ఆంజనేయులను అరెస్టు చేసి 5 లీటర్ల సారా, రాఘవాపురంలో ఇంజమూడి రాంబాబును అరెస్టు చేసి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.